# ఉద్యోగ పర్వం

మూర్తి ఆ సమయంలో గాలిలో నడుస్తూ వచ్చి బస్సు ఎక్కాడంటే ఆశ్చర్యం లేదు. ముఖంలో వద్దన్నా చిరునవ్వులు..ఎవరేనా చూస్తే పిచ్చిమనిషిలా తనలో తాను వెకిలి నవ్వులు నవ్వుకుంటున్నాడనుకుంటున్నారేమోనని అర్జెంటుగా రుమాలుతో ముఖం తుడుచుకోవడం ఆరంభించాడు. ఇంతకంటే సంతోషమైన సంగతి మరొకటుందుందా? తన కలలన్నీ యింత హఠాత్తుగా నిజస్వరూపం దాల్చడం నమ్మశక్యం కావడంలేదు.

బస్సు దిగి మళ్లీ గాలిలోనే తేలుతూ యిల్లు చేరాడు. తలుపు మీద మామూలు ప్రకారం సుతారంగా కాక ధన్ మని బలంగా కొట్టాడు. తలుపు తెరిచిన విజయ పాపాయి నెత్తుకొని కనుపించగానే మూర్తి ఆమెను చేతులతో చుట్టి "విజయా! నీకో మంచి వార్త. చాలా చాలా మంచి వార్త.. ఏమిస్తావు బహుమానం?" అన్నాడు.

విజయ అతడిని విడిపించుకుని "ఇదుగో యీ బంగారు కొండ మీకు బహుమానం! గదిలో బాబిగాడు మీ షర్టులన్నీ ఏం చేస్తున్నాడో చూద్దురుగాని పదండి" అన్నది.

ఈలోగానే పెద్దవాడు.. మూడేళ్ళవాడు "నాన్నా!" అంటూ వచ్చేశాడు. అంటే రావడానికి ప్రయత్నిస్తున్నాడు. ఎందుకంటే వాళ్ళ నాన్న చొక్కా బురఖాలాగ వేసుకుని నడవడం రాక పడిపోతూ వస్తున్నాడు.

'ఒరేయి. ఒరేయి. యిదేమిట్రా?" అని తన కొత్త షర్టుని రక్షించుకోవడానికి గట్టి ప్రయత్నం చేద్దామనుకొన్నాడు మూర్తి. కాని చేతిలో పాపాయి.

"విజయా! ఆ షర్టు తియ్యి! ముందు దీన్ని తీసుకో. నవ్వు తావేమిటి? కొత్త షర్టు మాసిపోతుంది. కాళ్ళ కింద పడి చిరిగి పోతుంది. ఐనా వాడి చేతికి నా బట్టలు యివ్వడమేమిటి? బీరువాలోంచి కింద పడేస్తోంటే చూస్తూ వూరుకోవడమేనా?" అన్నాడు కోపంగా మూర్తి.

పిల్లలు అల్లరి చేసినందుకంటే ఎక్కువగా, విజయ పట్టించుకోకుండా నవ్వడంతో మరింత కోపం వస్తోంది అతనికి. "యిదేం చూశారు. మధ్యాహ్నం చొక్కాలు నాలుగు పట్టుకొని పోయి బక్కెట్టునీళ్ళలో పడేసి సబ్బు గుమ్మరించాడు.వాటిని పిండి ఆరేశాను.యిప్పుడు పాపకి పాలు కలిపేంతలో మళ్ళీబయలుదేరాడు" అన్నది కొంచెం విసుగు ధోరణిలో.

"ఒరేయి! విప్పు! ఆ చొక్కా విప్పు... పాపా! నువ్వుండమ్మా" అని దాన్ని మంచం మీద దింపి వాడిని పట్టుకుని చొక్కా విప్పేంతలో పెద్దగా ఏడవడం మొదలు పెట్టింది పాప.

"దీన్ని తీసుకో! ఆ కాఫీ ఏదో నేను ఏడుస్తాను" అంటూ తన షర్టుని రక్షించుకొని వాణ్ణి వీపు మీద చిన్న దెబ్బ వేసి, పాపాయిని ఎత్తుకుని వూరుకోబెట్టాడు. ఆ చిన్న దెబ్బకే వాడు వీపు బద్దలై పోయినంత రాగం ఆరంభించాడు.

ఇద్దరినీ సముదాయించుకుంటూ, బొమ్మలు బిస్కెట్లు యిచ్చి ఒక చోట కూలేసి, కాఫీ తయారు చెయ్యడానికి వెళ్ళింది విజయ. కాస్సేపటికి ఆమెకు జ్ఞాపకం వచ్చినట్లుగా "చెప్పండి ఏమిటో శుభవార్త అన్నారు?" అన్నది.

చెప్పినట్లే వుంది నా తలకాయ అనుకుని "ఏదోలే, వీళ్ల గందరగోళం పూర్తయి తీరుబాటుగా వున్నప్పుడు చెబుతాలే" అన్నాడు. ఆమె మళ్లీ ప్రశ్నించకుండా పనిలో పడింది.

కాఫీ చేసుకుని రెండు గ్లాసుల్లో పోసింది. వచ్చి నేల మీద పరిచిన చాప మీద కూర్చున్నారిద్దరూ. ఆ చేత్తో దాన్ని, యీ చేత్తో వీడిని సర్దుతూ ప్రమాదాలు జరగకుండా వేడి వేడి కాఫీ యిద్దరూ తాగారు.

"చెప్పండి, ఏమిటో వూరిస్తున్నారే!" అన్నది విజయ. "నీకో మంచి వుద్యోగం వస్తున్నదోయి" అన్నాడు ముఖం వెలిగిపోతుండగా మూర్తి.

విజయకి నవ్వొచ్చింది. "ఇంత ఖచ్చితంగా చెప్పేస్తున్నారు ఏ చెట్టునైనా కాస్తోందా ఏమిటి, కోసుకోవడానికి సిద్ధంగా?" అన్నది.

ఈ వేళాకోళానికి కోపం తెచ్చుకోకుండా విషయమంతా చెప్పాడు మూర్తి. వాళ్ళ మేనమామ చాలా పలుకుబడి గల వ్యక్తి. ఆయన ఎవరికో ఒకపెద్ద వుపకారం చేసినప్పుడు వాళ్ళు మీ వాళ్ళకెవరికైనా ఒక మంచి ఉద్యోగం యిస్తాము. కృతజ్ఞత చూపడానికి అన్నారుట.

ఆయనకి పిల్లలు లేరు. అందుకే మూర్తి అంటే ప్రాణం. మూర్తికి భార్య అంటే ప్రాణమని, ఆ భార్యకి ఒక ఉద్యోగం వుంటే బాగుండునని అతని ప్రాణం ఒకటే కొట్టుకు పోతున్నదనీ ఆయనకు తెలుసు. అందుకే మధ్యాహ్నం తన దగ్గరకు పిలిపించుకుని, విజయ పేరున ఒక మంచి దరఖాస్తు టైపు చేయించి పుచ్చుకున్నాడు. నెలకు పన్నెండు వందలు జీతం. పని కూడా వినడానికి చాలా సులువుగానే వుంది.

ఆ దరఖాస్తు యిచ్చి వస్తే తాను గాలిలో నడుస్తూ, చిరునవ్వులు దాచుకోలేక ఎలా అవస్థ పడుతూ యింటికి చేరిందీ చెప్పాడు విజయకి. ఆమె కూడా సంతోషంతో ఎగిరి గంతేసి "రేపే చేరుతానండి. ఎక్కడ అది" అంటుందనుకున్నాడు మూర్తి. "అలాగా?" అన్నది క్లుప్తంగా విజయ. అంతకంటే ఏమీ ప్రత్యేకమైన ఆనందం కనబడకపోయే సరికి మూర్తి కొంచెం నిరాశ పొందాడు.

"ఫస్టుదాకా టైము అడుగుదామంటావా?" అన్నాడు. విజయ చూద్దాంలెండి అన్నట్టు కాఫీ గ్లాసులు తీసుకుని లోపలికి వెళ్ళి కూరగాయలు, కత్తి పీటతో తిరిగి వచ్చింది. కూరగాయల బుట్ట చూడగానే చంటి దాని ముఖం వికసించి పోయింది. చేతిలో వున్న బొమ్మని వదిలేసి, గబగబ పాకుతూ బుట్టవేపు రాసాగింది.

"చూస్తారేం? దాన్ని పట్టుకోండి" అని కేకేసింది విజయ. ఐదు నిముషాల తర్వాత విజయ వంక చూశాడు. ఆమె మూతి బిగించి కూరలు తరుగుతూనే వుంది. ఒక జవాబుగానీ, రేపట్నుంచి ఏమి చేద్దాం అని సంప్రదింపు గానీ కనబడలేదు.

"మీ అమ్మగారిని రమ్మంటే బాగుంటుందేమో!" అన్నాడు మూర్తి.

విజయ ఏమిటి అంటున్నారన్నట్లు కళ్ళెత్తి చూసింది గాని ఏమీ అనలేదు. బాబు పెన్నుతో కనుపించిన కాగితం మీదల్లా డిజైను గీసేసి యింక ఆ పని అయిందన్నట్లు కూరగాయల తొక్కులు బొమ్మ

గిన్నెల్లో పోయడం మొదలు పెట్టాడు."వాడిని అవతలికి తీసుకుని వెళ్ళండి. బాబీ! నువ్వు పుస్తకాలు తెచ్చుకో నాన్నా! చదువుకుందువు గాని" అన్నది.

అలా కనీసం గంటన్నర సేపు గడిచింది. భోజనాలైనాయి. అంటే వంటింటి రంగస్థలం పైన భోజన నాటకం బాల పాత్రల పుణ్యమా అని గంటలోపే ముగిసింది. పిల్లలు, పెద్దల ఓపికను బాగా పరీక్షించి, ఆకలిని చంపేసి చివరికి పక్కల మీదకు ఒరిగాక మూర్తి నిలవేశాడు విజయని.

"సాయంత్రం నుంచి చూస్తున్నాను. సరిగ్గా ఒక్క సంగతి మాట్లాడవేం? నీ అప్లికేషను మీద వాళ్ళు ఆర్డర్లు వేసేస్తున్నారు" అన్నాడు.

ఒక్క క్షణం తర్వాత ఆ మాటలు అర్థం చేసుకుని "నేను దేనికి అప్లయి చేయలేదుగా?" అన్నది. మూర్తి గర్వంగా నవ్వాడు. "నీకోసం అవకాశం ఆగుతుందేమిటి? దరఖాస్తులో ఫోర్జరీలు ఫరవాలేదని నేను చేవ్రాలు చేసి యిచ్చేశాను లేవోయి. రేపో మాపో ఇంటర్వ్యూ వస్తే ఏం చేయాలో జాగ్రత్తగా ఆలోచించుకోవాలి" అన్నాడు.

విజయ ఎందుకనో సరైన జవాబు యివ్వడం లేదని యిప్పటికే గ్రహించాడు మూర్తి. "నువ్వు వంటగది సర్దుబాట్లు తర్వాత చేసుకోవచ్చు గానీ, కూచో. మళ్ళీ చంటిది లేస్తే కష్టం" అన్నాడు' ఆమె చేయి పట్టుకుని కూలేస్తూ.

"మళ్ళీ చంటిది లేస్తే కష్టం కనుకే వంటింటి పని పూర్తి చేస్తానంటున్నాను. వదలండి" అన్నది.

"ఐనా యిప్పుడు చంటిది ఎందుకు లేస్తుంది? యిప్పుడేగా బొజ్జనిండా పాలు తాగి పడుకుంది. నీకు అన్నిటికీ ఏదో ఒక సాకు చెప్పడం అలవాటైపోయింది" అన్నాడు.

విజయ జవాబు చెప్పక తప్పదన్నట్లుగా "నేను ఉద్యోగం చేయనండీ యిప్పుడు" అన్నది.

మూర్తికి ఆకాశం మీద నుంచి నేల మీద పడినట్లైంది. "ఇప్పుడు చేయనంటే ఎప్పుడు చేస్తావు? దొరికినప్పుడే చేయాలి గానీ,మనం కావాలన్నప్పుడు దొరుకుతుందా?" అన్నాడు కోపంగా.

"నేను చేయనండీ! నేను బయటకు పోతే యీ పసి పిల్లల్ని ఎవరు చూస్తారు? నా పిల్లల్ని ఎవరి మీదో వదిలేసి, నేను వూరి మీద పడనండీ" అన్నది ఖచ్చితంగా విజయ.

"ఊరి మీద పడడమేమిటి? అసలు ఆ మాట ఏమిటి అంటున్నావు.ఆఫీసుకి టైముకి వెడతావు. టైము కాగానే యింటికి వస్తావు. పిల్లల్ని ఎవరి మీదో ఎందుకు వదులుతావు? పని వాళ్ళను పెట్టుకుంటాం. వాళ్ళకి వప్పగిస్తాం" అంటూ నిదానించి మాట్లాడబోయాడు మూర్తి.

"ఆహా ! పని వాళ్ళు! లోకంలో ఎక్కడున్నారో నాకో యిద్దర్ని తీసుకొని వచ్చి చూపించండి. పెట్టేసుకుంటాను. మీకు బొత్తిగా ప్రపంచ జ్ఞానం లేదండీ" అన్నది విజయ.

ఆ విధంగా ఆరంభమైన వారి వాదన రాత్రి పొద్దు పోయే వరకు సాగింది.మూర్తి మనస్సు కుతకుత వుడికిపోయింది" అంత చల్లని రాత్రిలో కూడా. తన జీతం చాలదు కనుక డబ్బుకోసం కక్కుర్తి పడి ఆమెను పట్టి బలవంతాన వీధిలోకి ఉద్యోగానికి తోసేస్తున్నట్లు, తను భార్యా బిడ్డలను పోషించడం చేతకాని అసమర్థుడైనట్లు ఫీలవసాగాడు మూర్తి. ఉద్యోగాలు చేస్తున్న ఆడవాళ్ళంతా నానా గడ్డి కరిచి చావలేక బ్రతుకుతున్నట్లు, జీవచ్ఛవాలైన కథలు వర్ణించి చెప్పింది విజయ విపులంగా. పిల్లలు తిండి లేక, పాలు, నీళ్ళు లేక, అనారోగ్యం పాలై అనాథలకన్నా కనాకష్టంగా అలమటిస్తున్నారని సోదాహరణంగా విన్నవించింది.

ఏమైతేనేం? చివరికి విజయ ఉద్యోగానికి వెళ్ళదనీ పెట్టిన దరఖాస్తు విఫలమనీ తేలింది.

చేతిలోకి వచ్చిన తీపి మిఠాయిని కాకి వచ్చి ముక్కున కరచుకొని ఎగిరి పోయినట్లు బాధ ఆరంభమైంది మూర్తిలో. పట్టుదల వదలని విజయ మూర్ఖత్వం వల్ల పెరట్లోని కల్ప వృక్షాన్ని ఎవరో పెకిలించుకొని పోతున్నట్లు గిలగిలలాడింది అతని మనస్సు. ఇంట్లోకి వచ్చిన కాసుల మూటని వీధిలోకి ఆమె విసిరి పారేస్తున్నట్లు ఆ క్షణం నుంచి మూర్తి ఆమె నొక నేరస్తురాలిగా చూడసాగాడు.

కాలం గడుస్తోంటే, మేనమామకు ముఖం చూపలేక సమాధానం చెప్పుకోలేక సతమతమై చివరికి ఆ బాధని అలా మింగేసి వూరుకొన్నాడు.

అలా నాలుగేళ్ళు గడిచాయి. పట్నంలో పెరిగే ఖర్చులతో, ఎదిగే పిల్లలతో, వారి బడి జీతాలు, డొనేషన్లు వగైరాలతో మూర్తి తట్టుకోలేక తల క్రిందులై పోతూనే రోజులు యీడుస్తున్నాడు. 'పోనీలెండి యిద్దరేగా' అంటుండేది విజయ.

ఒకరోజు సాయంత్రం మూర్తింటికి వచ్చేటప్పటికి విజయ చీరెలు బేరమాడుతోంది. మూడు చీరెలు ఎంపిక చేసుకుని పక్కకి పెట్టుకుని తర్వాత వాయిదాలలో ఎలా యిచ్చేదీ బట్టల అబ్బాయికి చెప్పి, అతని పుస్తకంలో అకౌంటు వ్రాసింది. ఈలోగా లాండ్రి షాపు మనిషి వస్తే బీరువాలోని ఐదు చీరెలు, యిస్త్రీకి యిచ్చింది. తలుపులు వేసి లోపలకు వచ్చి, పెరట్లో ఆరవేసిన బట్టలు మడతలు పెట్టి తీసుకొచ్చింది.

"ఏదైనా ప్రయాణమా? జోరుగా బట్టలు సర్దేస్తున్నావు?" అన్నాడు. ఉపద్రవమైన జవాబు ఏదో వినవలసి వస్తుందని అనుకుంటూనే అడిగాడు.

విజయ చిరునవ్వుతో "ప్రయాణం లాంటిదే అనుకోండి. కాఫీ యివ్వనా?" అన్నది.

"ఎన్నాళ్ళు? పిల్లలు, నేను కూడా వస్తున్నామా?" ఆమె నవ్వుతూనే వెళ్ళి కాఫీ తెచ్చి యిచ్చింది.

"నిదానంగా తాగండి. మరీ నిదానంగా వినండి సార్! మనం ఫస్టు నించి వుద్యోగానికి వెడుతున్నాం" అన్నది. మూర్తి తన ఆశ్చర్యాన్ని, కోపాన్ని, ఉద్వేగాన్ని అన్నిటిని లోపలే అణిచేసి చాలా మామూలుగా కాఫీ పూర్తిచేశాడు.

"ఎక్కడ? ఎంత? ఎందుకు? అని అడగరేం?" అన్నదామె చీరెలు లెక్కలు చూసుకుంటూ.

"అడిగితే చెబుతావో చెప్పవో! అవసరమనిపిస్తే నువ్వే చెబుతావుగా? పోనీలే నేను మామూలు మనిషిని కనుక అమాయకంగా అడుగుతున్నాను. నువ్వు వుద్యోగం కోసం వూరి మీద పడితే పిల్లల్ని ఎవరు చూస్తారు? వాళ్ళు అనాథలైపోరూ?" అన్నాడు ఎంతో తెలివిగా దెబ్బ కొట్టానన్నట్లు.

"నేను వెళ్ళి వుద్యోగం చేయకపోతేనే ముందు ముందు వాళ్ళకి, మీకూ కష్టం. అందుకే చేరేది. వాళ్ళకి చదువులు చెప్పించాలా, మంచి బట్టలు, చెప్పులు కొనాలా? ఎక్కడికేనా షికారు తీసుకుని వెళ్ళాలా? సెలవల్లో వూళ్ళు తిప్పాలా? కావలసిన పళ్ళు, పాలు, కూరలు కొనాలా? నేను వుద్యోగం చేయకపోతే యివన్నీ ఎలాగండీ" అన్నది కళ్ళు ఎంతో చక్కగా హావభావాలతో తిప్పేస్తూ.

మూర్తి మనస్సు చివుక్కుమంది. ముఖం కూడా చివుక్కుమన్నట్లే పెట్టాడు. "అంటే నేను అవన్నీ చేయలేనంటావు. అసమర్థపు మొహాన్ని కనుక నువ్వు సంపాదించి మునిగే సంసారాన్ని తేల్చాలి అంటావు!" అన్నాడు.

విజయ మొరటు మనిషి కాదు. భరించే వాడినన్న ఆత్మ తృప్తి పొందుతున్న తన సహచరుణ్ణి అవమానించాలన్నంత అహంకారమూ లేదు. అందుకే పక్కన కూలబడి అతనికి చేరువగా జరిగి "మై డియర్ మూర్తి సాబ్! పిల్లలు పసి వాళ్ళుగా వున్నప్పుడే వాళ్ళ క్షేమం కోరి ఉద్యోగం చేయను అన్నాను. ఇప్పుడు మళ్ళీ వాళ్ళ కోసమే ఉద్యోగంలో చేరుతాను అంటున్నాను. ఎప్పుడు ఏది అనాలో, ఎప్పుడు ఏది చేయాలో నాకు

కాస్త ఎక్కువగా తెలుస్తుంటుంది. అదీ తప్పేనా?" అన్నది.

"ఏ పిల్లల కోసమైతే యిల్లు వదిలి బయటికి వెళ్ళను అన్నానో, ఆ పిల్లల కోసమే యిల్లు వదిలి బయటికి వెడుతున్నాను" అంటున్న ఆమె మాటల్లోని తర్కం అర్ధం చేసుకోవడానికి ప్రయత్నం ఆరంభిచాడు మూర్తి.

"మరి ఉద్యోగాలు చెట్టున కాస్తున్నాయా.. కోసుకుని వళ్ళో పడేసుకోవడానికి?"

"ఓయస్! సందు చివర బళ్ళో ఒకటి, మీ మామయ్యగారి సిఫారుసుల్లో మరొకటి కాసి, పక్కానికి వచ్చి సిద్ధంగా వున్నాయి" అన్న విజయ మాటలు పన్నీటి జల్లులు అని పరవశించాలో, పల్లేరు కాయలు అని చీకాకు పడాలో తెలియలేదు ఆ మానవుడికి.

**– జ్యోతి. ఆగష్టు, 1989**